

గరుడ ప్రసాదం అందజేస్తున్న ఆలయ ప్రతినిధి శేషాచారి, శ్రీనివాస రంగనాథ బట్టా చార్యులు, బద్రినాథ్



గరుడ భగవంతుడికి లడ్డూ ప్రసాదం నైవేద్యంగా సమర్పించిన దృశ్యం

గరుడ ప్రసాదానికి పోటెత్తిన భక్తజనం

- జియాగూడ రంగనాథ స్వామి దేవస్థానంలో గరుడ ప్రసాదం పంపిణీ
- భారీగా తరలి వచ్చిన భక్తులు

జియాగూడ: గరుడ పూజల్లో నైవేద్యంగా సమర్పించిన గరుడ ప్రసాదం ఎంతో విశిష్టమైనదని జియాగూడ రంగనాథ దేవస్థానం ప్రతినిధి శేషాచారి అన్నారు. ఈ మేరకు మంగళవారం జియాగూడ రంగనాథ స్వామి దేవస్థానంలో ఇటీవల ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ స్వామికి ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాస రంగనాథ బట్టాచార్యుల ఆధ్వర్యంలో అభిషేకం, అలంకరణ, గరుడ ధ్వజారోహన, గరుడ పూజ, హారతి, ప్రసాద నైవేద్యం కార్యక్రమం ఘనంగా జరిగింది.



రెండేళ్లుగా ప్రసాదం పంపిణీ..

జియాగూడ రంగనాథస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న గరుడ పూజలు, ప్రసాదం కోసం సంతానం లేని మహిళలు కుటుంబసభ్యులతో కలిసి పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజల్లో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధి శేషాచారి, బద్రీనాథ్ మాట్లాడుతూ..రెండేళ్లుగా నిర్వహిస్తున్న గరుడ ప్రసాదం పంపిణీకి గ్రేటర్ నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం భక్తులు, సంతానం లేని వారు, దీర్ఘకాల వ్యాధిగ్రస్థులు వచ్చి గరుడ ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారని తెలిపారు. అలాగే 22న శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ కల్యాణ మహోత్సవం, 23న స్వామి వారి రథోత్సవం, 24న చక్రస్నానం, 25న పుష్పయాగం , 28న సహస్ర కళశాభిషేకం వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రంగనాథ సేవా సమితి సభ్యులు బొట్టు రామ్, గూడుమని చంద్రకాంత్, లక్ష్మీనారాయణ, మాడిశెట్టి సదానందం గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, నరేష్, భాస్కర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పఠన పరీక్షలో అనన్యకు గోల్డ్ మెడల్

అబిడ్స్: గణపతి సచిదానంద స్వామి దత్తపీఠం ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి భగవద్గీత శ్లోక పఠన పరీక్షల్లో నగరానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని వెంట్రప్రగడ నూత్న అనన్య కోల్డ్ మెడల్ సాధించారు. భగవద్గీతలోని 700 శ్లోకాలను నిరంతరంగా ఉచ్ఛరణ చేస్తూ పరీక్షల్లో ఏది అడిగినా శ్లోకాలను అద్భుతంగా చెప్పి విజయం సాధించారు. మైసూర్ నగరంలో జరిగిన కార్యక్రమంలో అనన్యకు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌ను ప్రముఖ ఆధ్యాత్మిక గురువు గణపతి సచ్చిదానంద స్వామి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని అణన్య మాట్లాడుతూ..దేశస్థాయిలో భగవద్గీత శ్లోకాల పఠనంలో మొదటి స్థానం పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాలన శక్తి, ఏకాగ్రత, శ్రద్ధ ఈ భగవద్గీత శ్లోకాల పఠనంతో తనలో ఎంతో పెరిగాయన్నారు.



గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంటున్న అనన్య

నిరంతరం సమాజంలో భగవద్గీత పట్ల ప్రయోజనాలు, భగవద్గీతతో కలిగే లాభాలను ప్రజలకు వివరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

'పూల్ డ్రైవ్'తో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

అఫ్జల్‌గంజ్: పూల్ డ్రైవ్‌తో తమ కళాశాల విద్యార్థులకు ఎంతో భవిష్యత్తు ఉంటుందని స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎస్.చలమారెడ్డి, కార్యదర్శి ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఐటీ దిగ్గజ కంపెనీ టెక్ మహింద్రా ఈ నెల 22న స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే పూల్ డ్రైవ్‌తో వందలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపాధి ఏర్పడుతుందన్నారు. మంగళవారం కళాశాలలో జరిగిన టెక్ మహింద్రా నిర్వాహకులతో కలిసి పూల్ డ్రైవ్ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్.చలమారెడ్డి, ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ..మూడు, నాలుగు సంవత్సరాలుగా ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులందరూ ఈ పూల్ డ్రైవ్‌లో పాల్గొని తమ భవిష్యత్తుకు పునాది బాట వేయాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ గిరిధర్ ఆకుల మాట్లాడుతూ..తమ కళాశాలలో గురువారం నిర్వహించే పూల్ డ్రైవ్ ప్లేస్‌మెంట్ కార్యక్రమంతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనాథ్, డాక్టర్ హేమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బేగంబజార్‌లో తిరంగా ర్యాలీ

అబిడ్స్: ఇండియన్ ఆర్మీకి అనుకూలంగా బేగంబజార్ ఎంజే బ్రిడ్జి నుంచి సిద్దిఅంబర్‌బజార్ చౌరస్తా వరకు మంగళవారం రాత్రి గోషామహల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమా మహేందర్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర బీజేపీ కార్యదర్శి డాక్టర్ ప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యాలయ కోఆర్డినేటర్ డి.గోపాల్‌జీ, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్‌లు తిరంగా ర్యాలీ ప్రారంభించి ప్రసంగించారు. భారత సైన్యం తలచుకుంటే పాకిస్తాన్ ప్రపంచ చిత్రపటంలోనే మాయమవుతుందన్నారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నట్రాజ్ నామ్‌దారి, ముక్కా కృష్ణాగుప్తా, రఘునందన్ యాదవ్, కార్పొరేటర్లు దర్శన్, శశికళ కృష్ణ, రాకేష్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో డాక్టర్ ప్రకాష్‌రెడ్డి, గోపాల్‌జీ, ప్రేమ్‌సింగ్ రాథోడ్

గోల్కొండ ఆసుపత్రికి రోగుల తాకిడి



గోల్కొండ ఏరియా ఆసుపత్రివద్ద బారులుతీరిన రోగులు

గోల్కొండ: వివిధ రకాల విష జ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. కొంత కాలంగా దోమలు విజృంభిస్తుండడంతో ప్రజలు విష జ్వరాల బారినపడుతున్నారు. ఈ కారణంగా వైద్యం కోసం ప్రజలు ప్రైవేటు దవాఖానాలతో పాటు ప్రభుత్వ దవాఖానాలకు క్యూ కడుతున్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ ఏరియా ఆసుపత్రికి సైతం కొన్ని రోజులుగా రోగుల తాకిడి పెరిగింది. ప్రతినిత్యం 800–900 మంది వరకు ఔట్ పేషంట్లు వస్తున్నారు. దీనికి తోడు బస్తీ దవాఖానాలకు కూడా రోగులు వైద్యం కోసం బారులుతీరుతున్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగ నిర్ధారణ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు తెలిపారు.

'రాష్ట్రంలో ప్రజలు మెచ్చేలా కాంగ్రెస్ పాలన'

గోల్కొండ: రాష్ట్రంలో ప్రజలు మెచ్చే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి అన్నారు. కార్వాన్ మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ మంగళవారం ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. పార్టీపై ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తూ బదనామ్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం తెలంగాణలో దేశంలో ఎక్కడ లేని విధంగా సుస్థిర ప్రభుత్వం ఉండి ప్రజలు మెచ్చేలాగా పాలిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిత్ర అభిషేక్, విజయ్‌ముదిరాజ్, ఉమేష్ తదితరులున్నారు.



రోహిణ్‌రెడ్డిని సన్మానిస్తున్న మిత్ర కృష్ణ తదితరులు

కుల్సుంపురాలో ఉపాధ్యాయులకు శిక్షణ



గోల్కొండ: ఉత్తమ విద్యాబోధనకు ప్రభుత్వ పాఠశాలలు నిలయాలని గోల్కొండ మండల డిప్యూటీ ఐవోఎస్ మహ్మద్ బషీర్ అన్నారు. కుల్సుంపురా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కొత్తగా వచ్చిన పాఠ్య పుస్తకాలపై జరుగుతున్న ఈ శిక్షణ శిబిరంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠాలను వారు అర్థం చేసుకునేలా బోధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లలకు చదువుపై ఆసక్తిని పెంచేందుకు ఎన్నో కొత్త అంశాలను పుస్తకాలలో చేర్పిందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో పాఠ్యపుస్తకాలు రూపొందించబడతాయని వాటిపై సమగ్ర అవగాహనను కల్పించుకున్న ఉపాధ్యాయులే విద్యార్థులకు చక్కగా వాటిని బోధించగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో కుల్సుంపురా సెక్టార్‌కు చెందిన వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో తాగునీటి సరఫరాలో కోతలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన నియోజకవర్గంలోని టోలిచౌకీ, గోల్కొండ, లంగర్‌హౌస్, కార్వాన్ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, డ్రైనేజీ లైన్‌ల నిర్వహణపై జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రాంతాల్లో ధ్వంసమైన తాగునీటి పైపులైన్‌లు, మ్యాన్‌హోళ్ల మూతలను జలమండలి ఎండీకి చూపించారు. క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా లీకేజీల ద్వారా ప్రతిరోజు వేలాది గ్యాలెన్ల తాగునీరు రోడ్లపాలు అవుతుందన్నారు. ఈ విషయంపై వివిధ డివిజన్‌ల డీజీఎంలకు, మేనేజర్లకు చెప్పిన కూడా లాభం లేకుండాపోయిందన్నారు. ఇదిలా ఉండగా బస్తీల ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లలో డ్రైనేజీ పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగుతూ రోడ్లను దుర్గంధభరితంగా మారుస్తున్నాయన్నారు. పాత కాలం నాటి డ్రైనేజీ లైన్‌లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. టోలిచౌకీ, నానల్‌నగర్, గోల్కొండ, లంగర్‌హౌస్ తదితర డివిజన్లలో జరుగుతున్న పనుల్లో వేగం పెంచి వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హరూన్‌ఫరాన్, మహ్మద్ ముస్తఫా తదితరులున్నారు.



నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

నేషనల్ అంబేడ్కర్ సేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న మన్నె శ్రీధర్‌రావు

నాంపల్లి: నేషనల్ అంబేడ్కర్ సేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి శాతిరి ప్రవీణ్‌కుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..హైదరాబాద్‌లో పార్టీని బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా నియమించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభుత్వ ఉద్యోగిపై దాడికి పాల్పడిన యువకుడికి జైలు

నాంపల్లి: ప్రభుత్వ ఉద్యోగిపై దాడికి పాల్పడిన ఘటనలో ఓ యువకుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా ఖరారైంది. ఈ మేరకు నాంపల్లి 16ఏసీజేఎం కోర్టు తీర్పును ఇచ్చింది. హబీబ్‌నగర్ ఎక్స్ రోడ్డులో నివాసం ఉండే మహ్మద్ మజీద్ (26) 2019లో మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ కిందపడ్డారు. కిందపడిన క్షతగాత్రుడు మహ్మద్ మజీద్‌ను పోలీసులు చికిత్స నిమిత్తం సమీపంలోని నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో క్షతగాత్రుడు ఆసుపత్రి సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా ఆసుపత్రిలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఈ కేసు నాంపల్లి క్రిమినల్ కోర్టులో విచారణ కొనసాగుతోంది. మంగళవారం 16 ఏసీజేఎం కోర్టు మహ్మద్ మజీద్ దోషిగా తీర్పును వెల్లడించింది. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటుగా రూ.20 వేల జరిమానా విధించింది.

పక్కా ప్లాన్‌తో ఫోన్ కొట్టేశాడు

బంజారాహిల్స్: ఓఎల్‌ఎక్స్‌లో ఫోన్ విక్రయానికి పెట్టిన ఓ యువకుడిని కొనుగోలు కోసం వచ్చిన మరో యువకుడు ఫోన్‌తో ఉడాయించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పటాన్‌చెరుకు చెందిన ఎండీ.అబ్దుల్లా రేహాన్ (19) తన ఫోన్ విక్రయిస్తానంటూ ఓఎల్‌ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. ఇందుకు షేక్ విక్రమ్ అనే వ్యక్తి తాను కొనుగోలు చేస్తానని చెప్పి జూబ్లీహిల్స్‌కు రప్పించాడు. ఎక్కడైనా టీ తాగుదామంటూ రేహాన్ బైక్‌పై జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–44లోని ఓ హోటల్‌కు తీసుకువెళ్లాడు. కాసేపటి తర్వాత విక్రమ్ పక్కా పథకంతో తన గర్ల్‌ఫ్రెండ్ బయట వేచి చూస్తుందని, ఆమెతో మాట్లాడి వస్తానంటూ బైక్ తీసుకుని వెళ్లిపోయాడు. అదే బైక్ డిక్కీలో రేహాన్‌కు చెందిన ఫోన్ కూడా ఉంది. 10 నిమిషాల తర్వాత విక్రమ్ ఫోన్ చేసి తాను ఫర్జీ హోటల్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యానని చెప్పడంతో వెంటనే రేహాన్ ర్యాపిడో బుక్ చేసుకుని ఘటనా స్థలానికి వెళ్లాడు. అక్కడ తన బైక్ ఒక పక్కన పార్క్ చేసి ఉంది. అయితే అందులో ఉండాల్సిన ఫోన్ కనిపించలేదు. విక్రమ్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. రూ. లక్ష ఖరీదు చేసే ఫోన్‌తో ఉడాయించిన విక్రమ్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

విద్యుత్ సేవల నెంబర్లలో మార్పులు

బేగంబజార్ విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు విభాగాలకు చెందిన అధికారులు, అత్యవసర సేవలకు సంబంధించిన ఫోన్ నెంబర్లలో మార్పులు జరిగినట్లు డీఈ ఫర్హత్ అలీ తెలిపారు. విద్యుత్ సంబంధిత సేవల కోసం ఇకపై ప్రజలు ఈ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. – అఫ్జల్‌గంజ్

ప్రాంతం	ఫ్యూజ్‌ఆఫ్ కాల్‌సెంటర్	అసిస్టెంట్ ఇంజనీర్
కార్వాన్	87124 70882	87124 70821
మంగళ్‌హాట్	87124 70880	87124 70822
దత్తాత్రేయనగర్	87124 70886	87124 70823
సుల్తాన్‌బజార్	87124 70869	87124 70824
ట్రూప్‌బజార్	87124 70871	87124 70825
బేగంబజార్ (ఫీల్‌ఖానా)	87124 70875	87124 70826
సీతారామ్‌పేట్	87124 70878	87124 70827
చుడిబజార్	87124 70877	87124 70828
పుత్లీబౌలి	87124 70873	87124 70833

నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయండి

పాతబస్తీలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా తదితర నియోజకవర్గాల్లోని ప్రజలు మీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం, లో వోల్టేజీ, ఇతర విద్యుత్ సమస్యలపై ప్రజలు ఈ కింద నంబర్లలో సంప్రదించవచ్చు. - శాలిబండ

చార్మినార్ డీఈ	– 8712470715	చందులాల్ బారాదరి ఏఈఈ	– 8712470726
చార్మినార్ ఏఈడీ	– 8712470716	అత్తాపూర్ ఏఏఈ	– 8712470727
ఫలక్‌నుమా ఏఈడీ	– 8712470717	మీరాలం ఏఏఈ	– 8712470728
మీరాలం ఏడీఈ	– 8712470718	చార్మినార్ సీబీడీ–3, ఏఈ	– 8712470729
చార్మినార్ సీబీడీ ఏడీఈ	– 8712470719	చార్మినార్ సీబీడీ–5, ఏఈ	– 8712470730
చార్మినార్ ఏఏఈ	– 8712470720	చార్మినార్ సీబీడీ–1, ఏఈ	– 8712470731
మొఘల్‌పురా ఏఏఈ	– 8712470721	చార్మినార్ సీబీడీ–4, ఏఈ	– 8712470732
హుస్సేనీఆలం ఏఏఈ	– 8712470722	చార్మినార్ టెక్నికల్ ఏఈ	– 8712470733
ఫలక్‌నుమా ఏఏఈ	– 8712470723	కిషన్‌బాగ్ ఏఈ ఓపీ	– 8712470734
చాంద్రాయణగుట్ట ఏఈ	– 8712470724	చార్మినార్ సీఎస్‌సీ ఏఈ	– 8712470735
ఛత్రినాక ఏఈఈ	– 8712470725		

గో వధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

జియాగూడ: చౌటుప్పల్ మీదుగా వధశాలకు తీసుకెళ్తున్న 28 గోవుల లారీని అడ్డగించి అందులో ఉన్న జీవాలను జియాగూడ సమర్థ గోశాలకు తరలించారు. అరటి పండ్ల లోడ్‌లో గోవులున్నట్లు సమాచారం లభించడంతో గోరక్షా దళ్ టైగర్ ఫోర్స్ తెలంగాణ ఆధ్వర్యంలో దళ్ సభ్యులు అరటిగేళలను కిందకు దించగా గోవులను కనిపించాయన్నారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. ఇందులో అధ్యక్షుడు దీపక్ సింగ్, యుగ తులసి ఫౌండేషన్ సభ్యులు శివకుమార్, గోగ్యాన్ ఫౌండేషన్ నితేష్, విజయ్, రాకేష్ సింగ్, శంకర్ సింగ్, కేదర్ సింగ్, వివేక్ సింగ్, కొత్తూర్ విశాల్, ఏబీవీపీ ఠాకూర్ ఆయుష్ సింగ్, అభిషేక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నాంపల్లి: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖను రాశారు. సీఎం రేవంత్ రెడ్డికి రాసిన సమస్యల వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అనేక మార్లు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన 5 శాతం మధ్యంతర భృతితో విశ్రాంత ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నట్లు వివరించారు. పెన్షన్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. జూలై 2022, జనవరి 2023, జూలై 2023, జనవరి 2024, జూలై 2024 చెందిన ఐదు విడతల కరువు భృతి విశ్రాంత ఉద్యోగులకు రావాల్సి ఉందన్నారు.

వేధింపులకు పాల్పడుతున్న యువకుడిపై కేసు

బంజారాహిల్స్: భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటున్న వివాహితను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో ఉన్న ఫొటోలతో బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్న యువకుడిపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్న వివాహిత (22) రోడ్డునెంబర్–14లో ఉంటుంది. ఆమెకు 2020లో పెళ్లి కాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం భర్త వదిలేయడంతో ఆమె పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఇటీవల ఆమెకు టోలిచౌకికి చెందిన ర్యాపిడో డ్రైవర్ అబ్దుల్ గఫార్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీయడమే కాకుండా పెళ్లి కూడా చేసుకుంటానని నమ్మబలికాడు. అయితే సదరు యువకుడు డ్రగ్స్, మద్యానికి బానిసయ్యాడని తెలుసుకున్న బాధితురాలు దూరంగా పెట్టసాగింది. తనను దూరం పెట్టడాన్ని సహించలేని నిందితుడు ఆమెతో ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానంటూ బ్లాక్ మెయిల్ చేయసాగాడు. సోమవారం రాత్రి ఆమె పనిచేస్తున్న ఆస్పత్రి వద్దకు వచ్చి తీవ్రంగా కొట్టాడు. ఆమెతో ఉన్న ఫొటోలను ఆమె స్నేహితురాలికి కూడా పంపించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తిపై దాడి

బంజారాహిల్స్: మద్యం తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి అక్కడ ఉన్న సిబ్బందిని గ్లాస్ కావాలంటూ అడగ్గా ఉచితంగా ఇవ్వలేమని చెప్పడంతో దాడిచేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీనగర్‌కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న గోర్కటి మొగి లి (53) సోమవారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–2లోని ఇందిరానగర్‌లో ఉన్న ప్రియాంక వైన్స్‌కు మద్యం తాగడానికి వెళ్లాడు. అక్కడ ప్లాస్టిక్ గ్లాసులు, నీళ్లు విక్రయించే వ్యక్తిని తనకు ఒక ప్లాస్టిక్ గ్లాస్ కావాలంటూ అడిగాడు. డబ్బులు ఇవ్వనిదే గ్లాస్ ఇవ్వనని సదరు వ్యక్తి చెప్పడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన వాటర్ సప్లై చేసే యువకుడు అక్కడ ఉన్న కర్రతో మొగిలి తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. బాధితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఇంటర్ విద్యార్థినిపై లైంగిక దాడి

బంజారాహిల్స్: ఇంటర్ విద్యార్థినిని బలవంతంగా గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు అయింది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముండే విద్యార్థిని (17) ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. ఈనెల 19న సోదరితో కలిసి బయటకు వచ్చింది. అక్కడి నుండి సోదరి వేరే పనిమీద వెళ్లిపోగా విద్యార్థిని ఒంటరిగా ఇంటికి బయలుదేరింది. మధ్యలో సమీప బంధువైన నవీన్ ఆమెను కలిసి తాను తోడుగా వస్తానని చెప్పాడు. ద్విచక్ర వాహనం మీద ఆమెను ఎక్కించుకొని దేవరకొండ బస్తీలోని తన ఇంటికి తీసుకువచ్చాడు. కాస్త పని ఉంది పూర్తిచేసుకుని వెళ్దామని ఆమెను ఇంట్లోకి తీసుకువెళ్లి బెడ్రూంలో బలవంతంగా లైంగిక దాడి చేశాడు. బయటికి చెప్తే చంపేస్తానని బెదిరించాడు. విద్యార్థిని తనకు జరిగిన ఘటనపై సోదరుడికి చెప్పింది. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక పూజలు

చార్మినార్: గుల్జార్ హౌజ్ వద్ద జరిగిన భారీ అగ్నిప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య అన్నారు. మంగళవారం వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒకే కుటుంబాలకు చెందిన 17 మంది అగ్నికి ఆహుతి కావడం మనల్ని మానసిక వేదనకు గురి చేస్తోందన్నారు. ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. పాతబస్తీలోని ప్రజలందరూ సేఫ్టీ మెజర్స్ పాటిస్తే.. ఇలాంటి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తమను తాము కాపాడుకోవడానికి వీలు కలుగుతుందన్నారు.

బాలుడి అదృశ్యం



రామ్‌చరణ్

అబిడ్స్: బాలుడు అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మంగళ్‌హాట్‌కు చెందిన రామ్‌చరణ్(17) ఇటీవల ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి సుమిత్రా దేవి మంగళవారం మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీలు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే 87126 60493కు సమాచారం అందించాలని మంగళ్‌హాట్ పోలీసులు కోరారు.